క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాజాం సిటీ: మండలంలోని బొద్దాం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఈఈ జి.సురేష్‌బాబు, ఏఈ వి.సురేష్‌కుమార్ ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

రక్త పరీక్షలు

రేగిడి: మండలంలోని బాలకవివలస గ్రామంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో 200 మందికి రక్తనమూనాల పరీక్షలు నిర్వహించామని రెడ్‌క్రాస్ సొసైటీ రాజాం శాఖ ప్రతినిధులు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ తెలిపారు. రాజాం జీసీఎస్‌ఆర్ జాతీయ సేవా పథకం–1 పీవో సీహెచ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. రెడ్‌క్రాస్ సిబ్బందితో విద్యార్థులు ఇంటింటికీ వెళ్లి, రక్తనమూనాలు తీసుకుని, పరీక్షించి, రక్తం గ్రూపు తెలియజేశారన్నారు. కార్యక్రమంలో పెంకి చైతన్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు ఇందుమతి

రేగిడి: మండలంలోని కందిశ గ్రామంలో గ్రామానికి చెందిన వంజరాపు ప్రశాంతికి మంజూరైన రూ.2 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును జెడ్పీటీసీ సభ్యురాలు పాలవలస ఇందుమతి చేతులమీదుగా గురువారం అందజేశారు. అనారోగ్యం కారణంగా మెరుగైన వైద్యం కోసం అయ్యే ఖర్చులకు అందించిన ఈ సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రశాంతి తండ్రి అశోక్‌కు జెడ్పీటీసీ సూచించారు.

గమేలాల పంపిణీ



వేతనదారులకు గమేలా అందజేస్తున్న సురేష్, తదితరులు

బాడంగి: మండలంలోని పింద్రంగివలసలో ఉపాధిహామీ వేతనదారులకు గురువారం గమేలాలు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన స్వచ్ఛంద సేవకుడు రౌతు సురేష్ తన తల్లితండ్రులు లక్షుంనాయుడు, సింహాచలమమ్మ పేరు మీద వీటిని పంపిణీ చేశారు. అలాగే గొల్లాది గ్రామానికి చచెందిన పెద్దగిరడ అప్పలస్వామి రామమందిర నిర్మాణానికి రూ. 10 వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో వేతనదారులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.


సిద్ధం కిట్ల పంపిణీ



సిద్ధం కిట్లు అందజేస్తున్న పార్టీ రాజాం రూరల్ అధ్యక్షుడు రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ నర్సింహులు

రాజాం: మండలంలోని రాజయ్యపేట గ్రామంలో వైఎస్సార్ సీపీ సిద్ధం కార్యక్రమానికి సంబంధించిన కిట్లు గురువారం పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ రాజాం రూరల్ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు బండి నర్సింహులు కలిసి వీటిని పంచాయతీలోని బూత్ కమిటీలకు, కన్వీనర్లకు, పార్టీ కార్యకర్తలకు అందజేశారు. సార్వత్రిక ఎన్నికలు ఎప్పుడు జరిగినా సిద్ధంగా ఉండాలని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, జేసీఎస్ కన్వీనర్ కామోదుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జైశ్రీరామ్ దీక్షలు ప్రారంభం



జై శ్రీరామ్ దీక్షలు చేపట్టిన భక్తులు

రేగిడి: మండలంలో వన్నలి గ్రామంలో శ్రీకోదండరామస్వామి ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా గ్రామానికి చెందిన 150 మంది భక్తులు జైశ్రీరామ్ దీక్షలు గురువారం చేపట్టారు. గ్రామ పురోహితులు వేమకోటి సుబ్రహ్మణ్యస్వామి ఆధ్వర్యంలో ఈ దీక్షలకు సంబంధించి, భక్తులకు మాలాధారణ చేశారు. ఈ నెల 23వ తేదీ నుంచి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ గార రమణ, డీలర్ల సంఘం అధ్యక్షుడు ఎస్.రామ్మూర్తినాయుడు తెలిపారు.

అక్కచెల్లెమ్మలకు అండగా జగనన్న..

- సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా
- నియోజకవర్గంలో 21,637 మందికి రూ.40.57 కోట్ల చేయూత నిధులు విడుదల
- ఎంపీ బెల్లా, ఎమ్మెల్యే శంబంగి



చేయూత నిధుల చెక్కు ఆవిష్కరిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే,అధికారులు

బొబ్బిలి: మహిళల కళ్లలో ఆనందం చూడడం కోసమే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ అన్నారు. గురువారం స్థానిక కళాభారతి మున్సిపల్ ఆడిటోరియంలో వైఎస్సార్ చేయూత నాలుగో విడత నిధుల విడుదల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ.. మహిళల ఆర్థికాభివృద్ధి, స్వయం ఉపాధికి ఏటా రూ.18,750 ఆర్థిక సాయం చేస్తున్న ముఖ్యమంత్రి దేశంలో మరెక్కడా లేరన్నారు. ఈ నిధులతో మహిళలు ఆర్థిక భరోసా పొందుతున్నారని చెప్పారు. సంక్షేమ పథకాల అమలులో మహిళలకు ప్రాధాన్యమిస్తూ కుటుంబాలను వృద్ధిలోకి తీసుకువస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌దేనని స్పష్టం చేశారు. చంద్రబాబు గతంలో 600 హామీలిచ్చి ఒక్కటి కూడా అమలు చేయలేదని... తాజాగా ఆరు గ్యారెంటీలతో ఎన్నికలకు రావడం సిగ్గుచేటన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మాటలను నమ్మవద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకునే జగన్ మోహన్‌రెడ్డికి మద్దతు పలకాలని కోరారు.

మదమెక్కిన రాజులెందుకు?: ఎమ్మెల్యే శంబంగి

ఇచ్చిన హామీలను అమలుచేసే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మనకు ఉండగా.. మదమెక్కిన రాజుల వెనుక తిరగాల్సిన ఖర్మ ఎందుకని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పెన్షన్లు కావాలన్నా జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులుండేవన్నారు. ప్రస్తుతం అర్హత ఉంటే చాలు పథకాలు ఇంటి వద్దనే అందుతున్నాయని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాలనూ గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం మహిళలకు ఆసరా చెక్కు అందజేశారు. అంతకుముందు



మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చేయూత నిధులతో మహిళలు చేపట్టిన ఉపాధి యూనిట్లను సందర్శించి వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీ బెల్లానకు అధికారులు, నాయకులు బొబ్బిలి వీణ అందజేశారు. కార్యక్మంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, వైస్ చైర్మన్లు చెలికాని మురళీకృష్ణ, రమాదేవి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు, మండల అధ్యక్షుడు ఉత్తరావిల్లి అప్పలనాయుడు, మున్సిపల్ కమిషనర్ ఎల్. రామలక్ష్మి, ఎంపీడీఓ పి. రవికుమార్, ఎంపీపీలు శంబంగి లక్ష్మి, నర్సుపల్లి ఉమాలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు సంకిలి శాంతకుమారి, అప్పికొండ సరస్వతి, ఏఎంసీ చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, వైస్ చైర్‌పర్సన్ తెంటు పార్వతి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూవీఎల్ఎన్ రాయలు, వెలుగు సీఎంఎం జి. రాము, నాలుగు మండలాల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలను సద్వినియోగం చేసుకోవాలి



వీసీ దంపతులను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

బొబ్బిలి: కళాశాలల్లో ఏర్పాటు చేస్తున్న క్యాంపస్ ఇంటర్వ్యూలను సద్వినియోగం చేసుకుని మీ భవిష్యత్‌కు బంగారు బాట వేసుకోవాలని జేఎన్‌టీయూ వీసీ, ప్రొఫెసర్ కె.వెంకటసుబ్బయ్య అన్నారు. మండలంలోని పిరిడిలో గోకుల్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం రాత్రి 23వ వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వీసీ దంపతులు వెంకట సుబ్బయ్య, డాక్టర్ కె. పద్మావతిలను కళాశాల ఎం.డి బొత్సా వెంకటరమణ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లు అందించేందుకు చర్యలు



టిడ్కో అధికారులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

బొబ్బిలి: నిర్మాణం పూర్తయిన టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు త్వరితగతిన అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో టిడ్కో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. బొబ్బిలిలో 300 చదరపు అడుగుల ఇళ్లు 1104 .. 430 చదరపు అడుగుల ఇళ్లు 144 పూర్తయ్యాయని, వాటిని లబ్ధిదారులకు అప్పగిస్తామని చెప్పారు. కార్యక్రమంఓ టిడ్కో డీఈఈ ఆర్.శశిధర్, ఏఈలు నవీన్, స్వాతి ఉన్నారు.

నేత్ర పరీక్షలు తప్పనిసరి

రాజాం సిటీ: ప్రతి ఒక్కరూ రెండేళ్లకోసారి నేత్ర పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరి అని, ఇలా పరీక్షలు చేసుకోవడం ద్వారా గ్లకోమా వ్యాధి ద్వారా సంభవించే అంధత్వం నుంచి దృష్టి లోపాన్ని కాపాడుకోవచ్చని ఆప్తాలమిక్ అధికారి ఎస్.వసంతరావు అన్నారు. గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా స్థానిక నర్సింగ్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేత్ర వైద్య నిపుణుల సలహాలను పాటించడం ద్వారా అంధత్వం బారిన పడకుండా ఉండొచ్చన్నారు. నేత్ర వైద్యులను సంప్రదించే సమయంలో స్పష్టంగా వ్యాధి లక్షణాలను అడిగి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వి.చిన్న పాల్గొన్నారు.

సారా తయారు చేస్తే క్రిమినల్ కేసు



బెల్లంఊటను పారబోస్తున్న దృశ్యం

వంగర: సారా తయారు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ట్రైనీ డీఎస్పీ ఎస్.మహేంద్ర హెచ్చరించారు. మండల పరిధిలోని వీవీఆర్ పేటలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న సారా తయారీ కేంద్రాలపై పోలీసులు గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 2,600 లీటర్ల బెల్లంఊట, మరో 30 లీటర్ల సారాను పోలీసులు ధ్వంసం చేశారు. ఎక్కడైనా సారా విక్రయ కేంద్రాలు, తయారీ కేంద్రాలుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ వై.వి.జనార్ధన్ పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన బోర్ల మరమ్మతులు



మోదుగులపేటలో బోర్లు బాగుచేస్తున్న దృశ్యం

సంతకవిటి: క్రాస్ ప్రోగ్రాంలో భాగంగా మండలంలోని మిర్తివలస, పోతురాజుపేట, మోదుగులపేట గ్రామాల్లో పాడైన తాగునీటి బోర్ల మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నారు. మెకానిక్‌లు త్రినాథ్, కృష్ణమూర్తి, మన్మధరావులు ప్రత్యేక వాహనం ద్వారా గురువారం గ్రామం చేరుకుని, పాడైన బోర్లను బాగుచేసి, తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. వేసవి నేపథ్యంలో ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని స్థానిక నాయకులు తెలిపారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



బాడంగి: రానున్న సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని బొబ్బిలి రూరల్ సీఐ తిరుమలరావు కోరారు. మండలంలోని పినపెంకి, వాడాడ గ్రామాలలో గురువారం పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై ఆర్.జయంతి, స్థానిక పోలీసులు, కేంద్ర బలగాలు పాల్గొన్నాయి.

పినపెంకిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పరీక్ష సామగ్రి వితరణ



దేవుదళ కేజీబీవీలో విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందిస్తున్న చక్కెర కర్మాగార యాజమాన్యం

రేగిడి: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష సామగ్రిని సంకిలి ఈఐడీ ప్యారీ చక్కెర కర్మాగారం యాజమాన్యం వితరణ చేస్తున్నట్లు కర్మాగారం ఏవీపీ పట్టాభిరామిరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని దేవుదళ దగ్గరున్న కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయంలోని పదో తరగతి విద్యార్థినులకు గురువారం ఈ కిట్లు పంపిణీ చేయగా, ఆయన కాసేపు మాట్లాడారు. త్వరలో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో అట్టలు, పెన్నులు, స్కేళ్లు వంటివి సరఫరా చేస్తున్నామని, ఇప్పటివరకు సంకిలి, లక్ష్మీపురం, దేవుదళ, అంబఖండి తదితర పాఠశాలల్లోని 670 మంది విద్యార్థులకు వీటిని అందించామన్నారు. కార్యక్రమంలో కేన్ జనరల్ మేనేజర్ రాజేంద్రన్, హెచ్‌ఆర్ మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ లక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

- ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: త్వరలో జరగనున్న శాసనసభ, పార్లమెంట్ ఎన్నికలు చాలా ప్రతిష్టాత్మకమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని రేజేరులో గురువారం ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలందరికీ మేలు చేసిన జగన్ మోహన్‌రెడ్డి ఒకవైపు.. ప్రజలను మోసం చేసిన పార్టీలన్నీ మరోవైపు ఉన్నాయన్నారు. ఓటు వేసే ముందు ప్రజలు ఆలోచించాలని సూచించారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలతో గ్రామస్వరాజ్యాన్ని సాధించిన ముఖ్యమంత్రి జగనన్నకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. బొబ్బిలిలో రాజుకు.. రైతుల మధ్య పోటీ నెలకొందని, కాబట్టి ఓటర్లందరూ విజ్ఞతతో ఆలోచించి వైఎస్సార్‌సీపీకి మద్దతివ్వాలన్నారు. అంతకుముందు అన్నమ్మపేరంటాలు, శివాలయం, రామాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ భోగి గౌరి, జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, జిల్లా జేసీఎస్ కన్వీనర్ శంబంగి శ్రీకాంత్, మండల అధ్యక్షు డు బొమ్మినాయుని వెంకటనాయుడు, మండల వైస్ ఎంపీపీ బి.రమేష్, మరిపి శంకరరావు, వంగపండు రమేష్, ఎంపీపీ సలహాదారు తెంటు మధు పాల్గొన్నారు.

‘సిద్ధం’ సభలతో వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతం

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు



మాట్లాడుతున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు

రామభద్రపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిర్వహించిన ‘సిద్ధం’ సభలతో వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతం చెందిందని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ, సిద్ధం సభలకు వెల్లువెత్తిన జన సునామీని చూసి ప్రతిపక్ష పార్టీ నేతలకు వణుకు మొదలైందన్నారు. ప్రజలను మరోసారి మోసగించాలనే చంద్రబాబు పొత్తులు పెట్టుకున్నారని ఆరోపించారు. పొత్తు రాజకీయాలతో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు అయోమయంలో పడ్డారన్నారు. 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు ఏం చేశారో చెప్పుకోలేని స్థితిలో ఉన్నాడని ఎద్దేవా చేశారు. ముగ్గురు కాదు 30 మంది కలిసొచ్చినా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించడం ఖాయమని జోష్యం చెప్పారు. 175 అసెంబ్లీ స్థానాలు, 25 పార్లమెంట్ స్థానాల్లో వైఎస్సార్‌గెలుపు ఖాయమన్నారు. ఐదేళ్ల పాలనలో మేలు జరిగితేనే ఓటు వేయాలని చెప్పిన ఏకైక సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఒక్కరేనని కొనియాడారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలు, ఒక ఎంపీ స్థానం గెలిపించి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి కానుకగా ఇచ్చేందుకు ‘సిద్ధం’గా ఉన్నామన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు అప్పికొండ సరస్వతి, కొట్టక్కి ఎంపీటీసీ సభ్యురాలు సామిరెడ్డి రమణమ్మ, జేసీఎస్ మండల కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, పార్టీ మండల ఉపాధ్యక్షుడు కటికి చిన్నారావు, పువ్వల నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శివరాత్రి ఉత్సవాలు

వంగర: మండలంలోని సంగాం గ్రామంలో ఉన్న శ్రీసంగమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వారం రోజులుగా కొనసాగుతున్న మహాశివరాత్రి ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. మూడు నదులు కలిసే త్రివేణి సంగమంలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, అనంతరం స్వామిని దర్శించుకున్నారు. ఏటా ఇక్కడ జరిగే ఉత్సవాలు ఎంతో ప్రసిద్ధి కాగా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు వచ్చి, తమ మొక్కులు తీర్చుకోవడం విశేషం.

గ్రామాల్లో ‘వై ఏపీ నీడ్స్ జగన్’



కాశిందొరవలసలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించిన ఎంపీపీ శంబంగి లక్ష్మీ వేణుగోపాలనాయుడు, తదితరులు

బొబ్బిలి: ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమాన్ని మండలంలోని నారాయణప్పవలస, కాశిందొరవలస గ్రామాల్లో గురువారం నిర్వహించారు. ఎంపీపీ శంబంగి లక్ష్మీ వేణుగోపాలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆ గ్రామాల్లో అమలుచేసిన సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జెండాను ఎగురవేశారు. సర్పంచ్‌లు జాగరపు శ్రీనివాసరావు, కరణం దాలెమ్మ, ఎంపీటీసీ సభ్యుడు గొర్లె తిరుపతిరావు, జేసీఎస్ ఇన్‌చార్జ్ తమ్మిరెడ్డి దామోదరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఉత్తరావిల్లి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

రాజాం సిటీ: మహిళలంతా తమకు అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జీఎంఆర్ నైరెడ్ డైరెక్టర్ ఎం.రాజేష్ కోరారు. గురువారం స్థానిక సెయింట్ ఆన్స్ విలియం మేయర్స్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో జీఎంఆర్ నైరెడ్ సహాయంతో మగ్గం వర్క్ కోర్సు పూర్తి చేసిన మహిళలకు గురువారం సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 30 రోజుల పాటు నేర్చుకున్న ఈ కోర్సును భవిష్యత్తులో ఆర్థికంగా స్థిరపడేందుకు వినియోగించాలన్నారు. అవసరమైన వారికి బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం కూడా కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నైరెడ్ అసోసియేషన్ ప్రోగ్రాం మేనేజర్ నాగరాజు, సెయింట్ ఆన్స్ స్త్రీ శక్తి సెంటర్ డైరెక్టర్ సిస్టర్ హిల్డా తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయాలతో సుపరిపాలన



నూతన భవనాలు ప్రారంభిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ

వంగర: గ్రామ సచివాలయాలతోనే సుపరిపాలన సాధ్యమని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ అన్నారు. మండలంలోని ఎం.సీతారాంపురం గ్రామంలో రూ.78 లక్షల వ్యయంతో కొత్తగా నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్‌ల భవనాలను గురువారం ఆయన ప్రారంభించారు. మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాధన దిశగా అడుగులు వేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నూతనంగా గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి, రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన సేవలందిస్తున్నారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. రానున్న ఎన్నికల్లోనూ సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ కిమిడి ఉమామహేశ్వరరావు, సర్పంచ్ కాంబోతుల కళావతి తదితరులు పాల్గొన్నారు.

షెడ్యూల్ విడుదలైన వెంటనే ఎన్నికల కోడ్ అమలు

విజయనగరం అర్బన్: ఎన్నికల షెడ్యూల్ విడుదలైన రోజు నుంచి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని విజయనగరం నియోజకవర్గ ఆర్ఓ, జేసీ కె.కార్తీక్ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలో విజయనగరం నియోజకవర్గ స్థాయి ఎన్నికల అధికారులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల విధులు, మోడల్ కోడ్, తదితర అంశాలపై ఎన్నికల కమిషన్ జారీ చేసిన నిబంధనలను క్షుణ్ణంగా చదవుకోవాలని సూచించారు. ఎంసీసీ బృందాలు ఎన్నికల ఫిర్యాదులపై తక్షణ నిర్ణయం తీసుకోవాలన్నారు. ఏఈఆర్‌ఓలు రత్నం, విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ మల్లయ్యనాయుడు నియోజకవర్గానికి కేటాయించిన ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూరక్ష పథకంతో యాజమాన్య హక్కులు

- ఎమ్మెల్యే శంబంగి



ఇళ్ల హక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: భూరక్ష పథకంతో యాజమాన్య హక్కులు కలుగుతాయని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్వమిత్ర పథకంలో భాగంగా పది పంచాయతీలకు చెందిన లబ్ధిదారులకు శాశ్వత యాజమాన్య హక్కు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అవసరమైన సమయంలో ఇళ్లను తనఖా పెట్టుకునేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన ఇళ్లపై అప్పు తెచ్చుకునే అవకాశం లేదని, ఇకపై ఆ సమస్య లేకుండా ఇళ్లపై సంపూర్ణ హక్కు కల్పించామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ భోగి గౌరి, జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, తహసీల్దార్ రాజారావు, ఎంపీడీఓ ఆంజనేయులు, ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ, పీఆర్ ఏఈ రమేష్, వివిధ గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సౌకర్యాలు

విజయనగరం: నగర ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని మేయర్ వి.విజయలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో మేయర్ విజయలక్ష్మి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పొందుపరిచిన అంశాలకు కమిటీ సభ్యులు ఆమోదం తెలిపారు. అనంతరం ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్ మాట్లాడుతూ, అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు, అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, స్టాండింగ్ కమిటీ సభ్యులు పటాన్ల పైడిరాజు, పిన్నింటి కళావతి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

అలసత్వం తగదు...

విజయనగరం ఫోర్ట్: కంటి సమస్యల పట్ల అలసత్వం వహించరాదని డీఎంహెచ్ఓ భాస్కరరావు అన్నారు. ప్రపంచ గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా పుష్పగిరి కంటి ఆస్పత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ, గ్లకోమా వ్యాధిని త్వరగా గుర్తించాలన్నారు. 40 ఏళ్లు దాటిన వారు ఏడాదికి ఒకసారి కంటి పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. సమస్య ఉన్న వారు తగిన వైద్యసేవలు పొందాలన్నారు.